ములుగు జిల్లా రైస్ మిల్లులకే ధాన్యం

వారం రోజులకే మారిన నిర్ణయం

ములుగు, మే 6 (నమస్తే తెలంగాణ) : తాలు, తరుగు పేరుతో రైతులను దోపిడీ చేస్తున్నారని ములుగు జిల్లా రైస్ మిల్లులకు యాసంగి ధాన్యాన్ని తరలించేది లేదని మంత్రి సీతక్క ఆదేశాలతో తీసుకున్న నిర్ణయాన్ని వారం రోజులకే అధికారులు మార్చారు. ఎప్పటి లాగానే ములుగు జిల్లాలోని రైస్ మిల్లర్లకు ధాన్యాన్ని సరఫరా చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తున్నది. యాసంగి సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి రైస్ మిల్లర్ల యూనియన్ నాయకులు రా రైస్ ఇవ్వలేమని , ధాన్యం కొనుగోలు ప్రక్రియ లో పాల్గొనబోమని పలు డిమాండ్లతో మంత్రులతో పాటు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చిన విషయం తెలిసిందే.. కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాగానే క్వింటాకు 5 కిలోల నుంచి 10కిలోల మేర తాలు తరుగు పేరుతో కోతలు విధిస్తూ రైతులను వేదిస్తున్నారు. దీంతో ఏప్రిల్ 30న మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, ఆర్డీవో వెంకటేశ్, సివిల్ సప్లయ్ డీఎం రాంపతి ధాన్యం కొనుగోలు నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి జిల్లాలోని 42 రైస్ మిల్లులకు ధాన్యాన్ని కేటాయించవద్దని ఆదేశాలు జారీ చేశారు. యాసంగి సీజన్‌లో కొనుగోలు చేసిన మొత్తం ధాన్యాన్ని పొరుగు జిల్లాలైన హనుమకొండ, వరంగల్‌కు తరలించాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంతో ములుగు జిల్లా రైస్ మిల్లర్ల మనుగడకే ప్రమాదం ఏర్పడనున్నదని గ్రహించిన రైస్ మిల్లర్లు అధికారులు, మంత్రిని ప్రాదేయపడి కోతలు లేకుండా ధాన్యాన్ని దింపుకుంటామని బతిమాలుకున్నట్లు తెలుస్తున్నది. అయినప్పటికీ కొన్ని లారీల ధాన్యాన్ని హనుమకొండ రైస్ మిల్లులకు తరలించగా వారు సైతం దొడ్డు ధాన్యాన్ని మాత్రమే దింపుకుంటామని, సన్న ధాన్యాన్ని దింపుకునేందుకు వెనుకడుగు వేసినట్లు తెలిసింది. దీంతో అధికారులు చేసేది ఏమి లేక గతంలో మాదిరిగానే ములుగు జిల్లాలోని 42 రైస్ మిల్లులకు ధాన్యాన్ని కేటాయించేందుకు నిర్ణయించారు. రైస్ మిల్లర్లు కోతలు లేకుండా ధాన్యాన్ని దింపుకుంటారా..? లేదా అనేది చూడాల్సి ఉంది.

కారును ఢీ కొన్న లారీ- పలువురికి గాయాలు

కాటారం, మే 6: కాటారం – భూపాలపల్లి మధ్య అటవీ ప్రాంతంలో 353(సీ) జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం కారును లారీ ఢీకొన్న ప్రమాదంలో పరకాలకు చెందిన పలువురు గాయపడ్డారు. పోలీసులు, వాహనదారులు తెలిపిన వివరాల ప్రకారం.. పరకాలకు చెందిన బొచ్చు రమేశ్, కొత్తపల్లి చిరంజీవితో పాటు మరి కొందరు కారులో కాళేశ్వరం వెళ్లి పరకాలకు తిరిగి వస్తున్నారు. వరంగల్ నుంచి మహదేవపూర్ ఇసుక క్వారీకి ఇసుక లోడింగ్ కోసం వస్తున్న లారీ కమలాపూర్ క్రాస్ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. దీంతో కారులో ఉన్న రమేశ్, రజిత, చిరంజీవి, రంజిత్, రాకేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పలువురి చేతులు, పక్కటెముకలు విరగడంతో ఇతర వాహనదారులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.

ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

భూపాలపల్లి రూరల్, మే 6 : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పేషెంట్లు, వారి బంధువులకు చల్లని మంచి నీరు అందించాలన్న ఉద్దేశంతో సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో వాటర్ కూలర్ ఏర్పాటు చేశారు. మంగళవారం జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి దానిని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఉద్యోగికి, కుటుంబానికి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని వైద్యులకు ఆయన సూచించారు. సీఎంవో డాక్టర్ పద్మజ, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి మోట పలుకుల రమేశ్, ఐఎన్‌టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు బీ మధుకర్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు మద్దినేని శేషారత్నం, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జీఎం కార్యాలయంలో మంగళవారం (హెచ్‌ఆర్‌డీ)గా పదోన్నతి పొందిన జీ రఘుపతిని జీఎం రాజేశ్వర్‌రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎస్‌వోటు జీఎం కవీంద్ర, ఏజీఎం ఐఈడీ జ్యోతి, డీజీఎం ఫైనాన్స్ సురేఖ, ఇన్‌చార్జి ఏరియా ఇంజినీర్ అరుణ్ ప్రసాద్, ఏరియా సర్వే ఆఫీసర్ శైలేంద్రకుమార్, వీటీసీ మేనేజర్ రామన్‌పటాక్, ఏరియా అధికార ప్రతినిధి కావూరి మారుతి, ఈఎన్‌టీ డాక్టర్ గోపికృష్ణ పాల్గొన్నారు.

పాలంపేటలో రైతు నమోదు సర్వే

వెంకటాపూర్, మే 6 : పాలంపేట రైతు వేదికలో మంగళవారం రైతు నమోదు సర్వేపై ఏవో శైలజ అన్నదాతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం నిర్వహించే రైతు నమోదు సర్వేకు పట్టాదారు పాస్ బుక్ కలిగిన రైతులు భూమి పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్, ఆధార్ లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకొచ్చి రైతు వేదికలో రిజిస్టేషన్ చేయించుకోవాలని తెలిపారు. నమోదు చేసుకోని రైతులకు కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనం పొందలేరన్నారు. కార్యక్రమంలో ఏఈవో సునీల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోవాలి

గోవిందరావుపేట, మే 6 : మండలంలోని చల్వాయి మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లు ప్రాంభించామని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గండు కుమార్ మంగళవారం తెలిపారు. మొదటి సంవత్సరం ప్రవేశానికి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సుల్లో 40 చొప్పున ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు https://bit.ly/44kDPwn అనే వెబ్ సైట్ ద్వారా ఈ నెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 80963 50115 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన డీసీవో

కాటారం, మే 6 : మండలంలోని ధన్వాడ, శంకరంపల్లి, రేగులగూడెం, గారెపల్లి కొనుగోలు కేంద్రాలను జిల్లా సహకార అధికారి వాల్యానాయక్ మంగళవారం తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి ధాన్యం కొనుగోళ్లపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట మానిటరింగ్ అధికారి రిలీఫ్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈవో సతీశ్ ఉన్నారు.

సరస్వతీ పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

మంత్రులు కొండా సురేఖ , శ్రీధర్‌బాబు

సమీక్ష సమావేశంలో మంత్రులు సురేఖ, శ్రీధర్‌బాబు, అధికారులు

భూపాలపల్లి రూరల్, మే 6 : కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రవహించే 'అంతర్వాహిని' సరస్వతీ నది పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ, పరిశ్రమలు, చేనేత శాఖల మంత్రి శ్రీధర్‌బాబు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం మంత్రి సురేఖ అధ్వర్యంలో పుష్కరాలపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ పుష్కరాలకు రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు వస్తారని తెలిపారు. పుష్కరాలు 12 రోజుల పాటు జరుగుతాయని, మే 14న రాత్రి 10:35 గంటలకు బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించే సమయంలో పుష్కరకాలం ప్రారంభమవుతుందని, అప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి కావాలని స్పష్టం చేశారు. చలువ పందిళ్లు, టెంట్‌లు, శాశ్వత మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయాలని, కాళేశ్వరానికి సంబంధించిన వివరాలన్నీ వెబ్‌సైట్ యాప్ ద్వారా తెలియజేయాలన్నారు. అంతేకాకుండా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి రోజూ ఒక పీఠాధిపతి పుష్కర స్నానం చేయనున్నారని చెప్పారు. మే 15, 16న శ్రీ గురుమదనానంద సరస్వతి పీఠం, రంగంపేట, మెదక్ నుంచి మాధవానంద సరస్వతి స్వాములు పాల్గొని సరస్వతీ పుష్కరాలను ప్రారంభిస్తారన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజ్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి సెక్రటరీ లోకేష్‌కుమార్, సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకటరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే ఇతర శాఖల అధికారులు, ఆలయ ఈవో మహేశ్, ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు

పనులు ఆలస్యం చేసినందుకే పాలాభిషేకాలా ?

- 16 నెలల్లో 16 పైసల పని చేయని మంత్రిశ్రీధర్‌బాబు
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్

మల్హర్, మే 6 : అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో ఆలస్యం చేస్తున్నందుకే మంత్రి పాలాభిషేకాలు చేయించుకుంటున్నాడా అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఎద్దేవా చేశారు. మండలంలోని కిషన్‌రావుపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మల్హర్ మండల ప్రజల చిరకాల స్వప్నం ఖమ్మంపల్లి బ్రిడ్జి నిర్మాణం చేసి దూరభారం తగ్గించేలా రహదారుల సౌకర్యాలు కల్పించామన్నారు. కోల్ కారిడార్‌గా పేరున్న భూపాలపల్లికి నిత్యం మంథని నుంచి రాకపోకలు సాగుతున్న క్రమంలో ఖమ్మంపల్లి, తాడిచర్ల, కిషన్‌రావుపల్లి మీదుగా భూపాలపల్లికి చేరేలా నిధులు మంజూరు చేసి రహదారి నిర్మించామని, అయితే కిషన్‌రావుపల్లి నుంచి భూపాలపల్లి వరకు మధ్యలో ఫారెస్ట్ క్లియరెన్స్ రాక పనులు ఆగిపోయాయని తెలిపారు. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, మంథని ఎమ్మెల్యే మంత్రిగా అయినా ఇప్పటి వరకు రహదారి పూర్తి కాలేదన్నారు. మంత్రిగా ఉండి రోడ్డును పూర్తి చేయడంలో 16నెలలు గడిచిపోయాయని ఆయన విమర్శించారు. రెండు నెలల క్రితం ఒక జీవో తీసుకొచ్చి రూ.4 కోట్లు మంజూరు చేశారని, దీంతో ఆ పార్టీ శ్రేణులు మంత్రికి పాలాభిషేకాలు చేయడంతో పాటు ప్రతిపక్ష పార్టీకి చెంపపెట్టు అంటూ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మంత్రిగా ఫారెస్ట్ క్లియరెన్స్‌కు రెండు నెలలు పట్టినందుకు సిగ్గుపడాలే కానీ ప్రతిపక్ష పార్టీలను ఎగతాలి చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. 16 నెలలుగా కిషన్‌రావుపల్లి రోడ్డు పూర్తి చేయకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు నాగులమ్మ గుడి మీదుగా తిరిగి వెళ్లున్నారని, 22 కిలోమీటర్ల దూర భారం పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ జడ్పీటీసీ గోనె శ్రీనివాస్‌రావు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు తాజొద్దీన్, బీఆర్ఎస్ యువ నాయకుడు జక్కు రాకేశ్, మండల యూత్ అధ్యక్షుడు జాగిరి హరీశ్, నాయకులు వాల యాదగిరిరావు, సుధాకర్, జక్కు లక్ష్మణ్, బండారి సమ్మయ్య, నాగేశ్వర్‌రావు, అజ్మీరా సమ్మయ్య, నారా రమేశ్, సుంకు రాము, బండ రాజు, సురేశ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ములుగు డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

తాడ్వాయి, మే 6 : జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వాటి ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు సూచించారు. మండలంలోని కొడిశాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, మధుమేహం, క్యాన్సర్ వ్యాధుల పరీక్షల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని సూచించారు. ప్రభుత్వ సేవలను వినియోగించుకోనేటట్లు చేయడంలో ఆశల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. జాతీయ టీబీ నియంత్రణలో భాగంగా ప్రతి ఆశ కార్యకర్త 10 తెమడ పరీక్షల చొప్పున చేయించాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి పవన్‌కుమార్‌తో పాటు వైద్య సిబ్బంది ఉన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించాలి

చిట్యాల, మే 6 : కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు తరలించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరు నాయక్ సూచించారు. మంగళవారం ఆయన మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం ఎంత? మిల్లులకు తరలించింది ఎంత? ఇంకా కేంద్రాల్లోనే ఉన్న ధాన్యం ఎంత ? అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడకుండా రవాణా కాంట్రాక్టర్లు ఎప్పటికప్పుడు లారీలు పంపించాలన్నారు. రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆయన అనంతరం నవాబుపేట గ్రామానికి చెందిన పున్నం అశోక్ విత్తన ఉత్పత్తి వరి పంటను పరిశీలించారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ గుమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, ఏవో శ్రీనివాస్‌రెడ్డి, ఏఈవో సన్నీ ఉన్నారు.

ధాన్యాన్ని పరిశీలిస్తున్న వీరూ నాయక్

భూ నిర్వాసితులకు న్యాయం చేస్తాం..

గణపురం, మే 6 : సింగరేణి ఓసీ త్రీలో భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేస్తామని భూపాలపల్లి ఆర్డీవో రవి అన్నారు. మంగళవారం పరశురాంపల్లి గ్రామంలో భూ సేకరణ కోసం ప్రాథమిక ప్రకటన ప్రచురించిన 428.10 గుంటలు విస్తీర్ణం గల వ్యవసాయ భూములపై గ్రామసభ నిర్వహించారు. ప్రాథమిక ప్రకటన భూసేకరణ జాబితాలను గ్రామస్తులు, రైతులకు చదివి వినిపించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే గ్రామసభలో లిఖిత పూర్వకంగా తెలుపాలన్నారు. తహసీల్దార్ సత్యనారాయణస్వామి, ఎస్సై రేఖ అశోక్, ఎమ్మార్వై దేవేందర్, సింగరేణి, గ్రామ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వనిదే పనులు సాగనివ్వం

మొగుళ్లపల్లి, మే 6 : గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ మార్కింగ్ పనులను భూములు కోల్పోతున్న రైతులు అడ్డుకున్నారు. మంగళవారం వ్యవసాయ భూముల్లో మార్కింగ్ పనులు ప్రారంభించేందుకు రెవెన్యూ అధికారులు వచ్చిన విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి వెళ్లి నిరసన తెలిపారు. తమకు ఉపాధిగా ఉన్న భూమిని రోడ్డు నిర్మాణం కింద కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పరిహారం పెంచాలని, అంతవరకు తమ భూముల్లో పనులు జరుగనివ్వమని రైతులు అధికారులకు తెగేసి చెప్పారు. తహసీల్దార్ సునీత వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేయగా తమకు న్యాయం జరిగితేనే రోడ్డు నిర్మాణానికి సహకరిస్తామని, అంతవరకు తమ భూముల్లో ఎటువంటి పనులను చేపట్టొద్దని తెలిపారు.

తమ భూముల్లో పనులు చేపట్టొద్దంటూ నిరసన తెలుపుతున్న రైతులు

వైద్య పరీక్షలపై అవగాహన పెంచాలి

ములుగురూరల్, మే 6 : వ్యాధి నిర్ధారణ పరీక్షలపై ప్రజలకు అవగాహన పెంపొందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు అన్నారు. బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఆశ వర్కర్లు అనుమానితులకు తెమడ పరీక్షలు నిర్వహించి వైద్యాధికారులతో టీబీ మందులను అందించాలన్నారు. ఎండా కాలం సందర్భంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, గ్లూకోజ్‌ను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆశ డే సందర్భంగా తాడ్వాయి మండలంలోని కొడిశల పీహెచ్‌సీని సందర్శించి ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.

గొత్తి కోయలకు తాగునీటి సరఫరా

గోవిందరావుపేట, మే 6 : మండలంలోని కర్లపల్లి గ్రామపంచాయతీ పరిధి బూడిదగడ్డ గొత్తికోయ ప్రజలకు మంగళవారం ఎంపీవో మమత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్ తాగునీటి వాటర్ క్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడెంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకొని నీటిని అందజేశామన్నారు. నీటి వాహన సదుపాయం లేదని, బోరింగ్ వేయించేందుకు సైతం అవకాశం లేదన్నారు. ప్రజల దాహార్తిని తీర్చడంలో భాగంగా ఈ పంపిణీ చేశామన్నారు. కర్లపల్లి జీపీ కార్యదర్శి ఉస్మాన్ ఉన్నారు.

క్యాన్ల ద్వారా నీటిని అందిస్తున్న అధికారులు

దోస్త్ సహాయ కేంద్రం ప్రారంభం

ములుగురూరల్, మే 6 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందేందుకు జిల్లా స్థాయి దోస్త్ సహాయ కేంద్రాన్ని మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం ప్రారంభించారు. ఆన్‌లైన్ అడ్మిషన్‌కు సంబంధించి సాంకేతిక సమస్యలు తలెత్తితే విద్యార్థులు ఈ హెల్ప్ లైన్ సెంటర్‌ను సంప్రదించి ప్రవేశాలు పొందవచ్చునని సూచించారు. అడ్మిషన్లు మూడు దశల్లో ఉంటాయని, మొదటి దశలో రూ.200, 2,3వ దశల్లో రూ.400 ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9966153683, 89788 25734, 9550965334 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దోస్త్ కోఆర్డినేటర్ శంకర్, టెక్నికల్ అసిస్టెంట్లు హట్కర్ రమేశ్, ఎస్ రమేశ్, షరీఫా, పులి రామచందర్, పరమేశ్వర్, కవిత పాల్గొన్నారు.

మంత్రి పర్యటనకు ఏర్పాట్లు చేయాలి

వాజేడు, మే 6 : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ మండల పర్యటన బుధవారం నేపథ్యంలో కావాల్సిన ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ టీఎస్ దివాకర ఆదేశించారు. మంగళవారం మండలకేంద్రంతో పాటు ఎజ్జర్లపల్లిలో ఆయన పర్యటించారు. అనంతరం జీసీసీ రేషన్ దూకణం వద్ద రేషన్ బియ్యం కోసం వచ్చిన మహిళా లబ్ధిదారులతో ముచ్చటించారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి సర్దార్‌సింగ్, ఎంపీడీవో విజయ, తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్, ఏపీఎం లక్ష్మీదుర్గ, అధికారులున్నారు.

సమ్మర్ క్యాంపును వినియోగించుకోవాలి

ఏటూరునాగారం, మే 6 : వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం వెంకటాపురంలోని కేజీబీవీ పాఠశాలలో 15రోజుల పాటు సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంఈవో మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డ్యాన్స్, పాటలు, క్యారం, చెస్, డ్రాయింగ్ గేమ్స్, స్పోర్ట్స్, యోగా, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారని ఆయన పేర్కొన్నారు. సమ్మర్ క్యాంపులో వంద మందికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు క్యాంపు కో ఆర్డినేటర్ జయ వసంతలక్ష్మి 82470 25936 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

గురుకుల ప్రవేశాలకు లక్కీ డిప్

ములుగురూరల్, మే 6 : మైనార్టీ గురుకులంలో ప్రవేశాల కోసం నేడు లక్కీ డిప్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాన్ మైనార్టీ విభాగంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ విద్యార్థులను తల్లిదండ్రుల సమక్షంలో డ్రా పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే లక్కీ డిప్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావాలని సూచించారు.

నేడు కిడ్స్ అథ్లెటిక్స్ రిలే ఈవెంట్స్ పోటీలు

ఏటూరునాగారం, మే 6 : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ అథ్లెటిక్స్ డేను పురస్కరించుకుని కిడ్స్ అథ్లెటిక్స్ రిలే ఈవెంట్స్‌ను మండలకేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో బుధవారం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈపోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు ఉదయం 8 గంటలకు క్రీడా ప్రాంగణంలో హాజరు కావాలని కోరారు. గెలుపొందిన వారికి మెడల్స్ అందించనున్నట్లు చెప్పారు.

ఉరేసుకొని యువకుడి మృతి

భూపాలపల్లి రూరల్, మే 6 : ఉరేసుకొని యువకుడు మృతి చెందిన ఘటన భూపాలపల్లి పట్టణంలో జరిగింది. సీఐ నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మహాముత్తారం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గుడికందుల సతీశ్ (32) భూపాలపల్లి పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీలో కిరాయికి ఉంటూ చికెన్ షాప్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. భార్య కాపురానికి రావట్లేదని మనస్తాపానికి గురై మంగళవారం సాయంత్రం ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న గుడికందుల దేవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

రేణుకా ఎల్లమ్మ గుడి కోసం స్థల పరిశీలన

మల్హర్, మే 6 : మండలంలోని మల్లారం గ్రామ పంచాయతీ పరిధి దబ్బగట్టు తాటి వనంలో రేణుకా ఎల్లమ్మ దేవాలయ నిర్మాణం కోసం పరకాల డివిజన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ నందన కవిత స్థల పరిశీలన చేశారు. వీరి వెంట దూప దీప నైవేద్య అర్చక సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వెంకటరమణాచార్యులు, రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం కార్యదర్శి కన్నె సాంబయ్య, గౌడ సంఘం అధ్యక్షుడు కోట లింగయ్య, గంగాధర సమ్మయ్య, కోట చంద్రమౌళి ఉన్నారు.

జీపీ ట్రాక్టర్ కిందపడి బాలుడి మృతి

మహదేవపూర్, మే 6 : మండలంలోని జీపీ చెత్త ట్రాక్టర్ కిందపడి ఓ బాలుడు మృతి చెందాడు. ఎస్సై పవన్‌కుమార్ కథనం ప్రకారం.. పెద్దంపేట గ్రామంలో చెత్తసేకరణ సమయంలో జీపీ ట్రాక్టర్ డ్రైవర్ కురుసం రామకృష్ణ అతివేగంగా ట్రాక్టర్ నడుపుతూ ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడిని ఢీకొట్టడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి కార్తీక్ ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైల్వేను ప్రైవేటీకరించడం ఆపాలి

భూపాలపల్లి రూరల్, మే 6 : భారతీయ రైల్వేను ప్రైవేటీకరించడం ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నూరు రమేశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ రైల్వే ప్రయాణికుల భద్రతకు సరైన చర్యలు చేపట్టాలన్నారు. అంతేకాకుండా రైల్వేలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. భారతీయ రైల్వేను ప్రైవేటీకరించడం ఆపాలని, ప్యాసింజర్ రైళ్లను పెంచాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో స్లీపర్ క్లాస్, జనరల్ కంపార్ట్‌మెంట్లను పెంచాలన్నారు. సౌకర్యాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ రవికుమార్, రాజేందర్, కే రవికుమార్, శేఖర్, శంకర్, జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి

గణపురం, మే 6 : పార్టీలకతీతంగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కండె రవి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లు కేటాయించారని, ఇందిరమ్మ కమిటీలు నిరుపేదలైన రెడ్డి, వెలుమలకు, 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇండ్లు కేటాయించాలని సూచించారు. కాంగ్రెస్ వారికి మాత్రమే ఇండ్లను కేటాయిస్తే ఇ